విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిచ్కుంద, ఏప్రిల్ 19: మండలంలోని శాంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మూడు రోజుల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పవన్ కుమార్ తెలిపారు. శాంతాపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సర ఫరాలో శాంతాపూర్, మాన్యపూర్, సీతారాంపల్లి గ్రామాల్లో వ్యవసాయబోర్ బావులకు కరెంట్ సరఫరా ఉండదని రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

ఇసుకాసురులు



గుండారం పెద్దవాగులోంచి ఇసుకను తరలిస్తున్న దృశ్యం



క్యాసంపల్లి శివారులో ఉన్న వాగు నుంచి..



- కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో యథేచ్ఛగా ఇసుక దందా
- ఎండాకాలం కావడంతో వాగుల్లో లేని నీటి ప్రవాహం
- దీంతో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు
- కామారెడ్డి వాగు, రాజంపేట పెద్దవాగులో టన్నుల కొద్ది ఇసుక తరలింపు
- తెల్లవారు జామున, రాత్రి వేళలో తీసుకువచ్చి అడ్డాలపై నిల్వ
- అన్నీ తెలిసినా పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదులు చేసిన వారి వివరాలు అక్రమార్కులకు అందిస్తున్నారనే విమర్శలు

కామారెడ్డి టౌన్/రాజంపేట, ఏప్రిల్ 19: ప్రస్తుత పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు ఇళ్ల నిర్మాణాలు పెరిగిపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి మొదలుకొని పట్టణ ప్రాంతాల వరకు అన్నిచోట్ల వంద లాది నిర్మాణాలు జరుగుతుండడంతో ఇసుకకు భలే డిమాండ్ ఏర్పడింది. డిమాండ్‌కు తగ్గట్టుగా ఇసుక దొరకకపోవడం, ఎక్కడికక్కడ నిబంధనలు పెడుతూ ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తున్నా స్థానికంగా ఉండే కొందరు అధికారులు, సిబ్బంది అమ్యా మ్యాలకు అలవాటుపడి ఇసుకాసురులకు అండగా నిలవ డంతో అక్రమ ఇసుక రవాణాతో పాటు కృత్రిమ ఇసుకను తయారు చేసే స్థాయికి చేరి మూడు పువ్వులు.. ఆరు కాయలుగా దందా కొనసాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో చాలా చోట్ల వాగులు పారుతున్నా నిబంధనలు తుంగలో తొక్కి, భారీ యంత్రాలు పెట్టి మరీ తోడేస్తూ అక్రమ పద్ధతిలో కోట్లు గడిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ అక్రమదందా బహిరంగగానే జరుగుతున్నా ముడుపు లకు అలవాటు పడ్డ కొందరు అధికారులు పట్టించుకో వడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి మం డలంలోని క్యాసంపల్లి శివారులో కామారెడ్డి పెద్దచెరువు నుంచి నీరు పారే వాగు నుంచి, రాజంపేట మండలం లోని గుండారం గ్రామ శివారులో పెద్దవాగులోంచి పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవ డం లేదని స్థానిక రైతులు మండిపడుతున్నారు. ఇసు కను తోడేస్తుండడంతో నీరు నిల్వ ఉండక పరిసర ప్రాంతాల్లో బోర్లలో నీరు ఎత్తిపోతుందని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి ఉండదు.. అడిగేవారు లేరు!

ఏ వ్యాపారం చేయాలన్నా.. భారీగా పెట్టుబడులు పెట్టాలి. పదుల సంఖ్యలో పర్మిషన్లు కావా లి. అన్నీ పెట్టుకున్న తర్వాత దంద నడుస్తుందో లేదో తెలియదు. అదే ఇసుకయితే ఏ టెన్షన్ ఉండదు. ఒక్కసారి పెట్టుబడి పెడితే సరిపోతుంది. దానికి ఓ దుకాణం, అడ్డా అంటూ ఏదీ అవసరం లేదు. నేరుగా నిర్మాణం వద్దనే లారీ లేదంటే ట్రాక్టర్ లోడ్ దింపేయవచ్చు. లేదంటే ఎక్కడో ఓ చోట డంప్ చేసుకుంటే సరిపోతుం ది. అవసరమున్నప్పుడు తరలించుకోవచ్చు. అదేం చెడిపోయే వస్తువు కాదు. ఇక అన్ని ంటికంటే ఇసుక దందాలో వచ్చే లాభాలే అధికంగా ఆకర్షిస్తున్నాయి. కొందరు వాగులనే అడ్డాలుగా చేసుకుంటూ అను మతి లేక పోయినా అడిగేవారు ఈ దరిదాపుల్లో కనిపించకపోయినా టన్ను ల కొద్ది ఇసుకను తరలిస్తున్నారనే విమ ర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికంగా ఉండే కొందరు కిందిస్థాయి సిబ్బంది సహకారం ఉందనే వాదనలు లేకపోలేదు.

కామారెడ్డి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున దందా

కామారెడ్డి నియోజకవర్గంలో ఇసుక దందాకు హద్దూ అదుపులేకుండా పోతోంది. కొందరు నాయకులు ఈ దం దాను ముందుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి శివా రులో కామారెడ్డిపెద్ద చెరువు అనుబంధంగా పారే వా గులో ప్రస్తుతం నీరు లేకపోవడంతో పెద్ద ఎత్తున ఇసుక మేటలు పేరుకపోయాయి. దీంతో ఆ వాగులోంచి టన్ను ల కొద్ది నిత్యం పదుల సంఖ్యలో ఇసుకను తరలిస్తున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇసుకను తరలిస్తుండడంతో వాగు పరిసర ప్రాంతాల్లో బోర్లలో నీరు తగ్గిపోతుందని వాపోతున్నారు. అదేవిధం గా రాజంపేట మండలంలోని గుండారం గ్రామ శివారులో పెద్దవాగులో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుకను తరలిస్తూ నడిమితండా, ఎల్లాపూర్ తండా, గుండారం గ్రామాల్లో ఇండ్ల వద్ద, పొలాల వద్ద ఎక్కువ శాతం డంపు చేస్తు న్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ ఇసుక తర లింపుపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. పంట పొలాల్లో ంచి ఇసుక ట్రాక్టర్‌లు వెళ్లడంతో భారీ గుంతలు ఏర్పడు తున్నాయని రాత్రి సమయంలో ఈ దందా పెద్ద ఎత్తున సాగుతోంది. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, కొండా పూర్, బస్వన్నపల్లి మీదుగా రాజంపేట వరకు, అటు మెదక్ జిల్లావైపు తరలిస్తున్నారు. ఇంతలా ఇసుక తర లుతున్న రైతులు ఆయా అధికారుల దృష్టికి తీసుకుపోతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఇక కామారెడ్డి మండలం గూడెంతో పాటు మాచా రెడ్డి మండలం ఆరెపల్లి గ్రామాల్లో పంట చేన్ల వద్ద కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ వాటిని కామారెడ్డికి తీసుకువచ్చి అమ్మ కాలు జరిపిస్తున్నారని ఎప్పటి నుంచో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ దందా గురించి సంబంధిత అధికారు లకు వివరిస్తే అప్పటికప్పుడు తనిఖీల పేరుతో అక్కడికి వచ్చి మమ అనిపించేస్తున్నారని పైగా ఫిర్యాదు చేసిన వారి పేర్లను చెబుతూ దందాకు అండగా నిలుస్తున్నా రనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నిర్మాణాలు పెరగడంతో ఇసుకకు భలే డిమాండ్

జిల్లా కేంద్రంతో పాటు, ఎల్లారెడ్డి, బాన్సువాడ లాంటి మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాల్లో ప్రధానం గా నిర్మాణరంగం దూసుకుపోతోంది. ఏ నిర్మాణమైనా ఇసుక లేనిదే పనికాదు. దీంతో ఇసుక తోడేసుకునే వారికి వరంగా మారింది. వాగులు, వంకల మీద పడడంతో పాటు కృత్రిమ ఇసుకను తయారు చేసి తరలిస్తున్నారు. అధికారుల పట్టింపులేనితనంతో యథేచ్ఛగా ఇసుక వ్యాపారులు విజృభిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. జిల్లా కేంద్రంతో పాటు, ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యలోనే అపార్ట్‌మెంట్లు అక్కడక్కడ కనిపించేవి. ఇప్పుడు వందల సంఖ్యలోనే భారీ భవనాలు, అపార్ట్‌మె ంట్లు కడుతున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాల నిర్మాణాలకైతే లెక్కేలేదు. ముఖ్యంగా రాజకీయ నాయకు లుగా చెలామణి అవుతున్న వారితో పాటు చోటమోట నాయకులు, కార్యకర్తలు ఈ దందాలను దర్జాగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికా రులు దృష్టి సారించి స్థానికంగా ఉండే అధికారుల పనితీరును పరిశీలిం చడంతో పాటు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కామారెడ్డి చైర్‌పర్సన్‌గా
గడ్డం ఇందుప్రియ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇందుప్రియ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 19: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రి య చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవా రం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ హాజరయ్యారు. ఈ సందర్భ ంగా కౌన్సిలర్‌లు నూతన చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీని వాస్‌రావు, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి

సంగారెడ్డి రూరల్/కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 19: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి రెండో రోజైన శుక్రవారం మూడు నామినేషన్లు దాఖల య్యాయి. నామినేషన్లు ప్రారంభమైన మొదటి రోజున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున సాగర్ ఒక నామినేషన్ సెట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. రెండో రోజు స్వతంత్ర అభ్యర్థులు బి.మారుతిరావు, కే.ఆ నందీశ్వర్ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రా లు దాఖలు చేయగా, మహదేవ్‌స్వామి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించిన అస్తులు, అప్పులు, నేరచరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీసు బోర్డుపై ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.



ఎల్లంపేట్‌లో వర్షానికి తడిసిన వరి ధాన్యం



సోమార్‌పేట్‌లో నేల కూలిన వృక్షాలు

మాచారెడ్డిలో వర్ష బీభత్సం

- నేలకొరిగిన వరి పంట
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- కూలిపోయిన రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు



ఇంటి రేకులు లేచి పోయిన దృశ్యం



నేల రాలిన మామిడికాయలు



నేల కూలిన విద్యుత్ స్తంభం

మాచారెడ్డి, ఏప్రిల్ 19: ఈదురు గాలులు, వర్ష బీభత్సంతో మాచారెడ్డి మండలంలో ఎల్లంపేట్, సోమార్‌పేట్, అంకిరెడ్డి పెల్లి తండా, రత్నగిరిపల్లి, ఘైసమ్మ చెరువు తండా, వంజపల్లి తదితర గ్రామాల్లో భారీగా పంట నష్టం జరిగింది. శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షంతో చేతికందిన వరి పంట నేల మట్టమయ్యింది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ధాన్యం కొన్న కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను లారీల్లో లోడ్ చేసినా వర్షానికి తడిసి పోయాయి. ఎల్లంపేట గ్రామంలో ఈదురు గాలులకు సుమా రు 20మంది రేకుల షెడ్లు కొట్టుకుపోయి ఇళ్లు కూలిపోయా యి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పెద్దపెద్ద వృక్షాలు నేల మట్టమయ్యా యి. మామిడి కాయలు రాలి పోయాయి. భారీగా కురిసిన వర్షానికి ఆరుగాలం పండిన పంట చేతి కందే సమయంలో కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరి ధాన్యం కుప్పలు నీరు నిల్వడంతో రైతుల కష్టాలు వర్ణాణాతీతంగా మారాయి. ప్రభు త్వం స్పందించి నష్టపోయిన పంటకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.

తప్పని కరెంటు తిప్పలు

- బాన్సువాడలో గంటల తరబడి కరెంటు పోతున్నవైనం
- ఉక్కపోత తాళలేక జనం ఉక్కిరిబిక్కిరి
- విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



చీకట్లో బాన్సువాడ పట్టణం

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 19: బాన్సువాడ పట్టణ ప్రజలకు కరెంటు తిప్పలు మళ్లీ మొదలయ్యాయి. ప్ర తీరోజు కరెంటు పోవడం పరిపాటయ్యింది. అసలే వేసవికాలం, ఆ పై కరెంటు పోతుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా రు. ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి క్షణం కరెంటు పోయినా అధికారుల పై చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించినా, విద్యుత్‌శాఖాధికా రులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సీఎం ఆదే శాలను సైతం బేఖాతరు చేస్తూ ఇక్కడి అధికారులు ఇష్టారీతిన వ్య వహరిస్తున్నట్లు స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా గంటల తరబడి విద్యుత్ సరఫరా లేకపోవ డంతో ప్రజలు ఉక్కపోత తాళలేకపోతున్నారు. అసలు కరెంటు ఎ ప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

గంటల తరబడి కరెంటు పోతున్నవైనం

బాన్సువాడ పట్టణంలో వేసవి ప్రారంభం నుంచి 24 గంటల వి ద్యుత్ సరఫరా సక్రమంగా లేకుండాపోయింది. ప్రతీరోజు ఎక్కడో ఓ చోట సమస్య తలెత్తడంతో, ఆ పనులు పూర్తి చేసే వరకు విద్యు త్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వేసవిలో విద్యుత్ భారం ఉంటుందని తెలిసినా కూడా అధికారు లు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే కరెంటు కష్టాలు మొదలయ్యాయని పలువురు అభిప్రాయపడు తున్నారు. బాన్సువాడలో జనాభా పెరిగింది, కాలనీలు సైతం పెరిగాయి. అందుకనుగుణంగానే విద్యుత్ శా ఖాధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంలా మారింది. గురువారం బాన్సువాడ పట్టణం లో గంటల తరబడి కరెంటు రాకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. పెద్దలు, చిన్నారులు ఉక్కపోత తాళలేక అవస్థలు పడ్డారు. ఇక ఐస్‌క్రీం పార్లర్ల యజమానుల ఆవేదన అం తా ఇంతా కాదు. గంటల తరబడి కరెంటు సరఫరా లేకపోవడంతో ఫ్రీజర్‌లలో ఉన్న ఐస్‌క్రీంలు కరిగిపోయి పాడయ్యాయని వాపోయారు. మొత్తానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో బాన్సువాడ అంధకారంలో మగ్గిపోయింది.

ఉక్కపోత తాళలేక జనం ఉక్కిరి బిక్కిరి

అసలే మండు వేసవి. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నా డు. క్షణంపాటు ఫ్యాన్లు నడవకపోయినా వేసవితాపం తట్టుకోలేని పరిస్థితి. అలాంటి సమయంలో బాన్సువాడ పట్టణంలో వి ద్యుత్ సమస్య ప్రజలను వేధిస్తోంది. విద్యుత్ సరఫరా సక్ర మంగా లేకపోవడంతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కరెంటు పోయిన సమయంలో బయటకు వెళ్లలేక, ఇళ్లలో ఉండలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శా ఖాధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటే ఇలాంటి క ష్టాలు వచ్చేవి కావని స్థానిక ప్రజలు అభిప్రాయపడు తున్నారు. రానున్న రోజుల్లోనైనా బాన్సువాడ పట్టణం లో కరెంటు కష్టాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరెంటు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం
● నాందేవ్, ఏఈ

విద్యుత్ సబ్‌స్టేషన్లో పవర్ సప్లయ్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అలాంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా పట్టణంలో లోడ్ అధికంగా ఉన్నచోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ను ఏర్పాటు చేస్తున్నాం. భవన నిర్మాణాలు జరిగే చోట విద్యుత్ వైర్లపై స్టీల్ రాడ్లు ప డడంతో విద్యుత్ సమస్య తలెత్తుతోంది. ప్రజలు గమనించి పనులు జరిపించుకోవాలి. అప్పుడప్పుడు కాలనీల్లో విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు ఆ సమస్యను నివృత్తి చేసేం దుకు కాసేపు కరెంటు సరఫరా నిలిపి సమస్యను పరిష్కరిస్తున్నాం.

ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలి

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

దోమకొండ, ఏప్రిల్ 19: ప్రజలంతా పిల్లాపాప లతో సుఖ సంతోషాలతో జీవించాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అ న్నారు. శుక్రవారం దోమకొండ మండల కేంద్రంలోని వనదుర్గపెద్దమ్మ ఆలయ 26వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పాడిపంటలు, పిల్లా పాపలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మ వారిని కోరుకున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుం చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం అనంతరం అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, ఆలయ కమిటీ చైర్మన్ పున్న లక్ష్మణ్, సభ్యులు పెద్ద బాలయ్య, సత్యం, రాజు, కృష్ణ, తీగల తిర్మల్‌గౌడ్, అనంత్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, అబ్రబోయిన స్వామి, మధు, రామస్వామిగౌడ్, సంతోష్‌రెడ్డి, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న షబ్బీర్‌అలీ

'విధులను సక్రమంగా నిర్వర్తించాలి'

రామారెడ్డి/మాచారెడ్డి, ఏప్రిల్ 19: ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. రామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచమర్రి కేంద్రాల్లో పాఠశాలలను శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీకి సంబంధించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, మండలంలోని పోసానిపేట పాఠశాలను సందర్శించి మౌలిక వసతుల కల్పనపై డీఈ, ఏఈలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, వీవోలకు పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంఈవో యోసఫ్, ఇరిగేషన్ డీఈ శాలిని, ఏఈ సంతోష్, కాంప్లెక్స్ హెచ్ఎం ఆనంద్, హెచ్ఎంలు మురళీ, బ్రహ్మం, ఉపాధ్యాయులు ప్రవళిక, దేవ్లా, తదితరులు పాల్గొన్నారు.

● పాఠశాలలను తనిఖీ చేసిన కలెక్టర్

రాజంపేట్: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మంజూరైన పనులను జూన్ 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం రాజంపేట మండలంలోని ఆరెపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, ఆరెపల్లి తండా పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు, చిన్న చిన్న మరమ్మతులను చేపట్టి పూర్తి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ సుష్మా, ఏఈ ఆనందం, ఎంఈవో రామస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ఆరెపల్లిలో మాట్లాడుతున్న కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

'23లోగా వయోవృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలి'

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 19: 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు హక్కుని వినియోగించుకునేందుకు ఈనెల 23లోగా బూత్ లెవల్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో ఇంటి నుంచి ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 3 నుంచి 8వరకు అధికారులు వారి ఇంటికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చూడాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులు వినియోగించుకోవాలని కోరారు. ప్రతీరోజు ఓటింగ్ వివరాలు బీఎల్‌వోలు అధికారులకు సాయంత్రం తెలియజేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు వేయడానికి ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ కేంద్రం సంఖ్య, బీఎల్‌వో పేరు, సెల్ నెంబర్ రాయించాలని తెలిపారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలను ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు, విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేకపోతే కొత్తగా నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. తాగునీటి వసతి, తరగతి గదులలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జూన్ 10లోగా అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రఘునాథ్‌రావు, డీపీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్‌కుమార్, జ్యోతి, సరళ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

● ఈవీఎంలను ఎల్లారెడ్డి, జుక్కల్‌కు తరలిస్తున్నాం

జిల్లాకు కేటాయించిన ఈవీఎంలను క్లోస్డ్ కంటైనర్‌లో జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు తరలిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. శుక్రవారం పోలీసు కార్యాలయం సమీపంలోని ఈవీఎంల తరలింపును రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టారు. ఈనెల 3న ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్, ఫస్ట్‌లెవల్ చెకప్ పూర్తి చేయగా నియోజకవర్గాలకు వాటి తరలింపును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం యంత్రాలపై అపోహలను తొలగించి, పారదర్శకత తీసుకువచ్చేందుకు ఎన్నికల కమిషన్ ర్యాండమైజేషన్ ప్రక్రియ ప్రారంభించిందని, ఏ ఈవీఎం ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో వెళ్తుందో ఆన్‌లైన్ ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ మాత్రమే నిర్దేశిస్తుందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గానికి 318 చొప్పున బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 357 వీవీ ప్యాట్‌లను తరలిస్తున్నామన్నారు. ఎల్లారెడ్డికి 337 చొప్పున బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను, 378 వీవీ ప్యాట్లను క్లోస్డ్ కంటైనర్‌లో తరలిస్తున్నామన్నారు. కామారెడ్డికి 33 చొప్పున బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లు, 372 వీవీ ప్యాట్‌లను కేటాయించామని, మరి 199 బ్యాలెట్ యూనిట్లు, 147 కంట్రోల్ యూనిట్లు, 71 వీవీ ప్యాట్‌లు జిల్లాకేంద్రంలో రిజర్వ్‌లో ఉంచుతున్నామని పేర్కొన్నారు.



రాజీనామా పత్రాన్ని డీసీవో కు అందజేస్తున్న సాంబారి మోహన్

అవిశ్వాసానికి ముందే
సొసైటీ చైర్మన్ రాజీనామా

- తాత్కాలిక చైర్మన్‌గా రమేష్ నియామకం
- త్వరలోనే చైర్మన్ ఎన్నిక: డీసీవో శ్రీనివాస్‌రావు

ఇందల్వాయి, ఏప్రిల్ 19: నల్లవెల్లి సొసైటీలో శుక్రవారం నాటకీయ పరిణామాల మధ్య సొసైటీ చైర్మన్ పదవికి సాంబారి మోహన్ రాజీనామా చేశారు. తాను నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఎంత నాటకీయ పరిణామాలతో ఐడీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారో అంతే నాటకీయంగా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో నల్లవెల్లి సింగిల్ విండో చైర్మన్ సాంబారి మోహన్‌పై ఈనెల 1వ తేదీన సొసైటీ మెజార్టీ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. దీనిని 3వ తేదీన డీసీవో శ్రీనివాస్‌రావు ఆమోదించి 19న బలనిరూపణకు సమయం ఇవ్వడంతో మెజార్టీ డైరెక్టర్లు అవిశ్వాసానికి అనుకూలంగా మద్దతు తెలిపేందుకు సొసైటీ కార్యాలయానికి చేరుకునే సమయానికి అరగంట ముందే సాంబారి మోహన్ తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను డీసీవో శ్రీనివాస్‌రావు ఆమోదించి వెంటనే తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ చిన్నబోయిన రమేష్‌కు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే చైర్మన్ ఎన్నిక ఉంటుందని ఆయన వెల్లడించారు. నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా రాజీనామా చేసిన సాంబారి మోహన్ చైర్మన్ పదవి కోల్పోవడంతోనే జిల్లాలో ఐడీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పదవులు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. రాజీనామా అనంతరం సాంబారి మోహన్ మాట్లాడుతూ తనకు గత నాలుగేళ్లుగా అన్నివిధాలా సహాయ సహకారాలు అందించిన సొసైటీ డైరెక్టర్లకు, రైతులకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ సహకారంతో నల్లవెల్లి సొసైటీని ఐడీసీఎంఎస్‌ను లాభాల బాటలో తీసుకెళ్లానని, అనివార్య కారణాలతో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్‌రావుతో పాటు క్లస్టర్ అధికారి పోశన్న, సొసైటీ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

21న టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 19: తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఈనెల 21న టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ కర్త తారాసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని 32 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌ను టీఎస్‌ఆర్‌జేడీసీ.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురావద్దని సమాచారం కోసం 9985432021, 9866559693 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు: సీఐ

బోధన్‌రూరల్, ఏప్రిల్ 19: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. రెండు రోజుల క్రితం డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఓ వ్యక్తిని కోర్టుకు పంపించగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు వివరించారు. ప్రతీరోజు ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు డ్రంక్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని, డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిని కోర్టుకు పంపిస్తున్నామని ఆయన తెలిపారు. తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానతో పాటు జైలుశిక్ష తప్పదని ఆయన పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి ఏప్రిల్ 19: మండల కేంద్రానికి చెందిన డొక్క ప్రియరంజనీ అనే యువతి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందినట్లు ఎస్సై విక్రం తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటల నుంచి కనిపించడం లేదని తన కూతురు ప్రియరంజనీ కనిపించడం లేదని, దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదని ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. తండ్రి డొక్క రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నామినేషన్ల దాఖలుకు
తరలివచ్చిన పొరుగు జిల్లా కార్యకర్తలు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్19: నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల సమర్పణకు పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల, జగిత్యాల నియోజికవర్గంలోని పలుగ్రామాల నుంచి బీఆర్ఎస్, బీజేపీ పార్టీ కార్యకర్తలు జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి మీదుగా నిజామాబాద్‌కు తరలివెళ్లారు. అయితే నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్దన్, బీజేపీ అభ్యర్థిగా ధర్మపురి అర్వింద్ శుక్రవారం తమ నామినేషన్లు సమర్పించనున్న సందర్భంగా జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లి మీదుగా వెలుతున్న కార్లు, ఇతర వాహనాలను బ్రహ్మగారిగుట్ల (జంబిహనుమాన్ ఆలయం) వద్ద ఏర్పాటుచేసిన పోలీస్‌చెక్‌పోస్టు వద్ద ఎంపీడీవో రాజశ్రీనివాస్, స్థానిక డ్యూటీ పోలీసు సాగర్ వాహనాలను తనిఖీ చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్19: మండలకేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మిస్తున్న చిలుకల చిన్నవ్వ ఆలయ నిర్మాణానికి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పస్కనర్సయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్, రాజన్న, గంగాధర్, సంజీవ్, మల్లారెడ్డి, ముత్యం, నవనీత్, ఉదయ్ పాల్గొన్నారు.

నేడు సేవాలాల్, రాంరావు మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠాపన

ఇందల్వాయి, ఏప్రిల్ 19: మండలంలోని స్టేషన్‌తండాలో శని, ఆదివారం సేవాలాల్, రాంరావు మహారాజ్‌ల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు బంజారా సేవాసంఘం సభ్యులు తెలిపారు. శుక్రవారం హోమం నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. శనివారం విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని, ఆదివారం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

నవీపేట, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి తర్వాత రెండు రోజులకు ఆనవాయితీ ప్రకారం ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తూతూమంత్రంగా కళాశాలల తనిఖీలు

● తనిఖీలు చేస్తున్నా మారని బీఈడీ కళాశాలల తీరు ● కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు వెనకాడుతున్న వర్సిటీ అధికారులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 19: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని బీఈడీ కళాశాలల్లో వసతులపై ఎన్‌సీఈటీ నిబంధనలకు మేరకు ప్రతీ ఏడాది జరగాల్సిన తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నడుస్తున్న వాటిపై చర్యలు తీసుకునేందుకు వర్సిటీ అధికారులు ముందుకు వెళ్లడం లేదు. ఇందుకు నిదర్శనం గత 2023-24 విద్యసంవత్సరంలో జరిగిన తనిఖీల్లో బీఈడీ కళాశాలలు నిబంధనలకు అనుగుణంగా వసతులు లేకపోవడంతో వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు గుర్తించి ఆ కళాశాలల యాజమన్యాలకు నోటీసులు సైతం ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ నోటీసులకు ఎటువంటి ప్రతిఫలం లేకుండా పోయింది. నోటీసులు ఇచ్చిన ఆ కళాశాలలు మాత్రం తీరును మార్చుకోలేదు. ఎన్‌సీఈటీ నిబంధనలు మేరకు ఉండాల్సిన ఎటువంటి వసతులు విద్యార్థులకు కల్పించడం లేదు దీంతో విద్యార్థులకు వసతులు అందడం లేదు. మౌళిక సదుపాయాలు లేక పోవడం కళాశాలల్లో ఉండాల్సిన క్రీడ మైదానం, తరగతి గదులు, ప్రాక్టికల్ కోసం ప్రత్యేక ల్యాబ్‌లు ఉండాలి అటువంటి కొన్ని కళాశాలల్లో చూద్దాం



టీయూ పరిపాలన భవనం

అనుకున్నా కనబడటం లేదు. మరికొన్ని కళాశాలల్లో విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించడంలో జాప్యం జరుగుతుండటంతో కొన్ని కళాశాలల యాజమన్యాలు విద్యార్థుల నుంచే ముందుగానే ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వసూళ్లు చేస్తున్నారు. ల్యాబ్ ఫీజులు, కళాశాలల డెవలప్‌మెంట్ ఫీజులు, రికార్డు ఫీజులు పేరుతో లక్షల రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయాలపై తెలంగాణ యూనివర్సిటీ అధికారులకు తెలిసిన మిన్నుకుండిపోతున్నారనే అపవాదు వినబడుతుంది. అధిక ఫీజుల వసూళ్ల చేస్తున్నరనే ఆరోపణలతో ఆర్మూర్‌లోని ఓ బీఈడీ ప్రైవేట్ కళాశాలపై గతంలో రిజిస్ట్రార్ యాదగిరికి విద్యార్థి సంఘం నాయకులు సైతం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి లక్షల రూపాయల్లో అక్రమంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నా వర్సిటీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తనిఖీలు మాత్రం ఏదో తుతుమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపనాలు ఉన్నాయి. తనిఖీల విషయంలో ప్రతీ ఏడాది కొన్ని కళాశాలలు న్యాయస్థానాల ద్వార తాత్కాలికంగా లబ్ధి పొందుతూ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల లను నడుపుతున్నారు. తనిఖీల్లో వాస్తవాలు బయటబడ్డా వాటిని వర్సిటీఅధికారులు చూడన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శఉంది. ఎందుకంటే ఆ ప్రైవేట్ కళాశాలలు కొందరు రాజకీయ నేతలతో వర్సిటీ అధికారులపై ఒత్తిళ్ల తెస్తున్నారనే అపవాదు ఉంది.

'ఎంపీగా గెలిస్తే బోధన్-బీదర్ రైల్వే లైన్ ఏర్పాటుకు కృషి'



మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్

కోటగిరి, ఏప్రిల్ 19: తనను జహీరాబాద్ ఎంపీగా గెలిపిస్తే బోధన్-బీదర్ రైల్వేలైన్ ఏర్పాటుకు ప్రత్యేక కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఉమ్మడి మండలాల కార్యకర్తల సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ బీబీపాటిల్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పదేళ్లుగా ఎంపీగా పని చేసిన బీబీపాటిల్ తన వ్యాపారాలకే ప్రాధాన్యతను ఇచ్చారని, ప్రజాసమస్యలు ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. దేవుడి పేరుతో ఓట్లు పడతాయనే ఉద్దేశంతో బీబీపాటిల్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారని ఆరోపించారు. ప్రజలకు సేవ చేస్తే ఓట్లు వేసి గెలిపిస్తారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో 14ఎంపీ సీట్లను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడారు.

వర్ని: ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్.. అతనో బిజినెస్ పాటిల్ అని జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ విమర్శించారు. శుక్రవారం చందూర్, వర్ని మండల కేంద్రాల్లో ఉమ్మడి మండలాల పార్టీ సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండుసార్లు ఎంపీగా బీబీపాటిల్‌ను గెలిపించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం అతను టీఆర్ఎస్‌కు పనికి రాని వ్యక్తిగా పేర్కొన్నారని, అందుకే దేవుడిపేరు చెప్పుకుంటే ఓట్లు వస్తాయని బీబీపాటిల్ బీజేపీ జెండా పట్టి కోట్ల రూపాయలతో టికెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. ఎంపీగా ఏనాడూ గ్రామాల్లోకి రాని వ్యక్తి కేవలం ఓట్ల కోసమే ప్రచారాలకు రావడం సిగ్గు చేటని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శకం ముగిసిపోయిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తూ అక్రమ కేసుల్లో ఇరికించిన చరిత్ర పోచారందేనని అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ స్పోర్ట్స్ పర్సన్ గిరిజా షెట్కార్, వైస్ ఎంపీపీ దశగౌడ్, యలమంచిలి శ్రీనివాస్ రావు, వీర్రాజు, సురేష్ బాబా, రాజిరెడ్డి, చంద్రశేఖర్, రాంబాబు, గంగప్ప, ఆయా మండలాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి'

బోధన్‌రూరల్, ఏప్రిల్19: విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి సంజయ్ తలారే డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వెళ్లే సమయంలో రైల్వే గేట్లు వేస్తున్న క్రమంలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సు దూసుకుని లోపలికి వచ్చి మరో గేటు వద్ద ఆగిపోయిందన్నారు. ఈ ఘటన చూసి ప్రజలు అవాక్కయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు గేటుకు ఒక పక్కకు ఉండిపోవడంతో రైలు సాఫీగా వెళ్లిపోయింది. ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారని పేర్కొన్నారు. సంబంధిత డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రథం షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 19: మండలకేంద్రం శివారులోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథం నిలుపేందుకు కావాలసిన షెడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ అస్యుల ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు కప్పగంటి రమేష్ చంద్రశాస్త్రి అద్వర్యంలో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సభ్యులు అంకిత్, జేసీబి రాజన్న, దశాగౌడ్, భూమేశ్వర్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న వీడీసీ సభ్యులు



కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పలు వార్డుల్లో బీజేపీ ప్రచారం

ఆర్మూర్‌టౌన్ ఏప్రిల్19: మున్సిపల్ పరిధిలోని 31, 32, 33వార్డులలో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు బీజేపీకి ఓటువేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను వారు కోరారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం పసుపుబోర్డును తీసుకువచ్చి అవినీతికి తావు లేకుండా అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు ఓటు వేయాలని ప్రజలను వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, నాయకులు శికారి శ్రీనివాస్, బాశెట్టి రాజ్‌కుమార్, దోండి ప్రకాష్, బోడమీది నవీన్, సురేందర్, మనోహర్, ప్రభాకర్, సతీష్, నవీన్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట, ఏప్రిల్19: మండలంలోని నిజాంపూర్ నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం ఉదయం పట్టుకోవడం జరిగిందని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిజాంపూర్ నుంచి జన్నేపల్లి వైపు ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండగా పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు చెప్పారు. సంబంధిత ట్రాక్టర్ల యాజమానులకు ఒక్కొక్కరికి తహసీల్దార్ నారాయణ 10వేల రూపాయల చొప్పున జరిమాన విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన కోఆప్షన్ మెంబర్

మోస్రా,ఏప్రిల్19: చందూర్ మండల కేంద్రంలో ఉమ్మడి మండల జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో మోస్రామండల కోఆప్షన్ మెంబర్ ఫిరోజ్‌తో పాటు 15మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మోస్రా మండల కన్వీనర్ కొత్తకొండ భాస్కర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తిమీర్‌కర్ అశోక్, మోస్రా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సైనాపురం నర్సారెడ్డి, బొజ్జ శ్రీనివాస్ గౌడ్, బిల్లా రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఎడపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని జానకంపేట గ్రామ శివారులో ఏర్పాటైన పోలీసు శిక్షణాకేంద్రంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా అదనపు కమీషనర్, పోలీస్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రాంగణంలో వేద పండితులతో నిర్వహించిన యజ్ఞ హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో కొలువు దీరిన అభయాంజనేయ స్వామికి తొలి పూజలు చేశారు. వేద పండితులు ఆలయ శిఖర ప్రతిష్ఠాపన అనంతరం నూతనంగా ప్రతిష్ఠించిన హనుమంతునికి ప్రత్యేక అలంకరణ చేసి హారతి ఇచ్చారు. ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవానికి హాజరైన పోలీసు అధికారులను, స్థానిక ప్రాత్రికేయులను సిటీసి ఆద్వర్యంలో సన్మానించారు. రాణాకలాన్, జానకంపేట గ్రామాలకు చెందిన హనుమాన్ దీక్ష స్వాములు ఈ ఉత్సవంలో సేవలందించారు. అనంతరం ఉత్సవానికి హాజరైన అందరికీ అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో పోలీసుశిక్షణా కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ మస్తాన్ అలీ, కమాండెంట్



పూర్ణాహుతి చేస్తున్న దృశ్యం

శంకర్, ఏఆర్ ఏసీపీ నాగయ్య, ఆర్ఐలు శ్రీపాల్, వెంకట్, శ్రీనివాస్, దేవి సింగ్, కోటేశ్వర్ రావు, సురేష్, నిజామాబాద్ మాజీ కార్పొరేటర్ సాయన్న, జానకంపేట బీజేపీ నాయకులు ఉప్పు సురేష్, ఎంపీటీసీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

'కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి'

పెద్దబజార్, ఏప్రిల్ 19: అనేక హామీలతో గద్దెనెక్కిన ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి చూపించాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతికి అడ్డా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అని అన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభంజనాన్ని భరించలేక అన్ని సర్వేలు ఈసారి కేంద్రంలో 400 సీట్లు బీజేపీకి పక్కా అని వెల్లడిస్తున్నాయని అన్నారు. రాహుల్‌బాబా ఈరోజు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అవినీతికి మోదీ చాంపియన్ అని అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మోదీ గురించి మాట్లాడేటప్పుడు స్థాయికి తగ్గట్టు మాట్లాడాలన్నారు. కాంగ్రెస్ గత 50, 60ఏళ్ల పాలనలో మొత్తం అవినీతిమయమని, 2జీ, 3జీ స్కామ్ అయినా అది కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని అన్నారు. దేశాన్నే కుటుంబంగా భావించి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా నిరంతరం దేశాభివృద్ధికి, దేశప్రజలకు సేవలందిస్తున్న మోదీని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తప్పకుండా ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కార్యకమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు న్యాలం రాజు, పంచరెడ్డి ప్రవళిక, చుక్క మధు, మెట్టు విజయ్, నారాయణ, తదితరులు, పాల్గొన్నారు.

రామాలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మోస్రా, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గ శాసన సభ్యులు పట్లోళ్ల సంజీవ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి పార్లమెంట్ ఎన్నికల విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు నందు పటేల్, గ్రామ అధ్యక్షుడు సైనిపురం నర్సారెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంఘం సాయిలు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్ గౌడ్, పిట్ల హరీష్, బిల్లా రాజు, సతీష్, సూర్య, పిట్ల శ్రీకాంత్, చింటు, శ్రీధర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ఎడపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోగల చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పోలేపల్లి ఇంద్రజ (40) మహిళ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమెబ తీవ్ర మనస్థాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమ పాలన'

బోధన్‌రూరల్, ఏప్రిల్ 19: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన అమలవుతుందని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నుండి టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గత 10సంవత్సరాల కాలంలో కేసీఆర్ రాష్ట్రంలో అవినీతి పాలన చేశారని, పనికి రాని ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు కూడగట్టుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎంపీపీతో పాటు భవానీపేట్ మాజీ సర్పంచ్ పల్లెంపాటి కృష్ణకాంత్, లంగ్డాపూర్ ఉప సర్పంచ్ సత్యనారాయణలతో పాటు సాలూర, బోధన్ మండలాలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద డబ్బులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద నగదు సీజ్

భిక్కనూరు, ఏప్రిల్ 19: భిక్కనూరు మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. శుక్రవారం తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ హయత్‌నగర్‌కు చెందిన చందర్ హరి ఎలాంటి ఆధారాలు లేకుండా తన కారులో వెంట తీసుకెళ్తున్న రూ.60 వేలను స్వాధీనం చేసుకున్నట్లు భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. ఎవరైనా ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులను వెంట తీసుకెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సాయికుమార్, రాంచందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

లింగంపేట, ఏప్రిల్ 19: మండలంలోని అయ్యపల్లిలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ముదిరాజ్ సంఘ సభ్యులు తెలిపారు. 20న పోచమ్మకు బోనాలు, పసుపు కొట్నం, గణపతి పూజ, 21న దేవతా మూల మంత్రం, హవనములు, 22న విగ్రహ ప్రతిష్ఠాపన, 23న పెద్దమ్మకు బోనాలు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులకు ప్రతీరోజు అన్నదాన కార్యక్రమం ఉందని వారు తెలియజేశారు.

బీబీ పాటిల్‌పై కేసు కొట్టివేత

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 19: ఎంపీ బీబీ పాటిల్‌పై హైకోర్టులో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దాఖలు చేసిన పిటీషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. 2019 ఎంపీ ఎన్నికల్లో ఎంపీ బీబీ పాటిల్ ఎన్నిక చెల్లదంటూ అప్పట్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. అయితే ఇద్దరి వాదోపవాదాలు విన్న తదుపరి మదన్‌మోహన్ వేసిన ఈ ఎన్నికల పిటీషన్ చెల్లదంటూ హైకోర్టు కేసు కొట్టివేస్తు తీర్పునిచ్చింది

దోమకొండ పోర్టుకు అవార్డు

దోమకొండ, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని కామినేని శోభన అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గడికోట పోర్టు అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పాత సంప్రదాయాలను పరిరక్షించినందుకు హెరిటేజ్ పోర్టుకు అవార్డును అందజేసినట్లు గడికోట సీనియర్ మేనేజర్ బాబ్జి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న కూచిపూడి, చేనేత తదితర పాత సంప్రదాయాలను నిర్వహిస్తున్నందున హెరిటేజ్ అవార్డును ప్రకటించిందన్నారు.

జిల్లా స్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 19: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్ ఏప్రిల్ 24న ఇందిరాగాంధీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జైపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14,16,18,20 బాలబాలికలు, మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులకు 100, 400, 600, 800, 1500, 5000 మీటర్ల విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరందరూ డేట్ ఆఫ్ బర్త్ లేదా వయస్సు ధ్రువీకరణ పత్రం లేదా ఎస్సెస్సీ మెమో తీసుకొని రావాలన్నారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ

తాడ్వాయి, ఏప్రిల్ 19: తాడ్వాయి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత అమ్మవారి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వారంవారం నిర్వహించే పల్లకిసేవ కార్యక్రమానికి భక్తులు తరలివచ్చే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో శబరిమాత భక్తులు గ్రామప్రజలు పాల్గొన్నారు.



భిక్కనూరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నుంచి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సస్పెన్షన్

భిక్కనూరు, ఏప్రిల్ 19: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల అమృతారెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు విండో చైర్మెన్ భూంరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అమృతారెడ్డిని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలను చేపట్టే వారిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, నాయకులు జిల్లెల రవీందర్‌రెడ్డి, తక్కల్ల మధు, చేపూరి అశోక్, రవీందర్‌రెడ్డి, నర్సింలు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో మన గ్రోమోర్ కేంద్రానికి తాళం వేసి ఆందోళన చేస్తున్న రైతులు

బీర్కూర్‌లో మన గ్రోమోర్ దుకాణానికి తాళం

● కేంద్రం ఎదుట రైతుల ఆందోళన

బీర్కూర్, ఏప్రిల్ 19: బీర్కూర్ మండల కేంద్రంలోని మన గ్రోమోర్ కేంద్రానికి శుక్రవారం స్థానిక రైతులు తాళం వేశారు. పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సుమారు మూడు వందల మంది రైతులు రబీ సీజన్‌లో మన గ్రోమోర్ కేంద్రంలో వరి విత్తనాలు కొనుగోలు చేసి పంటలను పండించారని తెలిపారు. అయితే 130 రోజులు గడిచినా పంట మాత్రం పండలేదన్నారు. గ్రోమోర్ కేంద్రం వారు తమకు నకిలీ విత్తనాలు అంటగట్టారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై వ్యవసాయ అధికారులకు, పోలీసులకు, మన గ్రోమోర్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మన గ్రోమోర్ కేంద్రం వారు, విత్తన కంపెనీ ప్రతినిధులు ఈనెల 12న పంట నష్ట పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయినా ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. శుక్రవారం రైతులు గ్రోమోర్ కేంద్రానికి వెళ్లి సిబ్బందిని నిలదీశారు. పరిహారం చెల్లిస్తామని చెప్పి ఎందుకు స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు సంబంధం లేదని, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుకోవాలని గ్రోమోర్ కేంద్రం సిబ్బంది రైతులకు రెచ్చగొట్టేలా సమాధానం చెప్పారు. దీంతో రైతులు గ్రోమోర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువగా మాట్లాడితే పోలీసులతో కేసులు పెట్టిస్తామని సిబ్బంది రైతులకు హెచ్చరించడంతో రైతులు కోపోద్రిక్తులై గ్రోమోర్ షాపుకు తాళం వేశారు. షాపు ఎదుట నిలబడి రైతులు ఆందోళన చేపట్టారు. గ్రోమోర్ కేంద్రం వారు, విత్తన కంపెనీ ప్రతినిధులు తమకు పంట నష్ట పరిహారం అందించేంత వరకు ఆందోళనలు చేపడుతునే ఉంటామని రైతులు హెచ్చరించారు.

నాగిరెడ్డిపేట ఎంపీపీ చాంబర్‌కు సీల్



నాగిరెడ్డిపేట ఎంపీపీ చాంబర్‌కు అధికారులు సీల్ వేసిన దృశ్యం

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 19: నాగిరెడ్డిపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌కు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీల్ వేసినట్లు ఎంపీడీవో పర్చన్న తెలిపారు. నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీగా ఎన్నికైన దివిటి రాజ్‌దాస్ సుమారు నాలుగున్నర సంవత్సరాలుగా ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతుండటంతో మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు వైస్ ఎంపీపీ దివిటి రాజ్‌దాస్‌పై అవిశ్వాసం పెట్టారు. ఈనెల 4వ తేదీన నాగిరెడ్డిపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ అవిశ్వాస బల పరీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలకు గాను ధర్మారెడ్డి ఎంపీటీసీ మృతి చెందగా, మండలంలోని తొమ్మిది మంది ఎంపీటీసీలకు గాను ముగ్గురు ఎంపీటీసీలు బల పరీక్ష సమావేశానికి గైర్హాజరు కాగా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు బల పరీక్ష సమావేశానికి హాజరై వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌కు వ్యతిరేకంగా చేతులు లేపడంతో అవిశ్వాసం నెగ్గిందని ఆర్డీవో ప్రభాకర్ ప్రకటించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. అయితే వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌పై బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసం నెగ్గినప్పటికీ, రాజ్‌దాస్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లోకి వచ్చి తన సీట్‌లో యదావిధిగా కూర్చుంటుండటంతో ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీలు ఈ విషయమై కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నాగిరెడ్డిపేట ఎంపీపీ చాంబర్‌కు సీల్ వేయాలని స్థానిక మండల పరిషత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎంపీపీ చాంబర్‌కు తాళం వేసి సీల్ వేసినట్లు, తాళం చెవిని కలెక్టర్ కార్యాలయంలో సమర్పించినట్లు ఎంపీడీవో పర్చన్న తెలిపారు.

ఆముదాల ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు

దోమకొండ, ఏప్రిల్ 19: మండల కేంద్రంలోని ఆముదాలపల్లి ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు హనుమాన్ సేవా సమితి సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

కన్నుల పండువగా పెద్దమ్మ కల్యాణం

● పట్టు వస్త్రాలను సమర్పించిన షబ్బీర్ అలీ

భిక్కనూరు, ఏప్రిల్ 19: మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో బాగంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జాతర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జాతరలో బాగంగా ఆలయ ప్రాం గణంలో ముత్యాల పందిరిని ఏర్పాటు చేసి అందులో పెద్దమ్మ-పెద్దిరాజుల ఉత్సవ విగ్రహాలను ఉంచి అమ్మవారి కళ్యాణాన్ని వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు అమ్మవారికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అయ్యావారిపల్లి గ్రామంలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రాంగణంలో పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, బీజేపీ జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎలుగు సిద్దా అమ్మఆరిని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈ కామేశ్వర్ రావ్

వినియోగదారులకు అందుబాటులో ఉంటాం

: డీఈ కామేశ్వరరావ్

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 19: బాన్సువాడ డివిజన్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని బాన్స్‌వాడ విద్యుత్ శాఖ డీఈ కామేశ్వర్‌రావ్ పేర్కొన్నారు. శనివారం పెద్ద కొడప్‌గల్ సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈ కామేశ్వర్‌రావ్ మాట్లాడుతు తమ సంస్థకు వినియోగదారులు అత్యంత ప్రాదాన్యమని, అందుకే డివిజన్ పరిధిలో గల వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. వినియోగదారుల సమస్యలు తీర్చేందుకు పిట్లం డివిజన్ పరిధిలో పెద్ద కొడప్ గల్ మండలంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కారవేదికను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇలా వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందకు ప్రతి మండలంలో పరిష్కారవేదికలు ప్రతి 6 నెలల ఒక సారి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇక వ్యవసాయ బోరు బావుల దగ్గర రైతన్నలు జాగ్రత్తగా ఉండాలని, వ్యవసాయ బోరుబావుల వద్ద విద్యుత్‌కు సంబందించి ఏదైనా సమస్య ఉంటే సంబందిత లైన్‌మెన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిట్లం డివిజన్ ఏడిఈ బాలాజీ, పెద్ద కొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ ఏఈలు సాయినాథ్, బుజ్జిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

లాడేగాం విద్యార్థికి డాక్టరేట్ పట్టా

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 19: జుక్కల్ మండలంలోని లాడేగాం గ్రామానికి చెందిన సుర్నార్ బాలాజీ ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన రుక్మిణిబాయి-అంగదరావ్‌పతిల కుమారుడైన బాలాజీ ప్రాథమిక విద్య గ్రామీణ ప్రాంతాలలో పూర్తి చేశారు. అనంతరం ఉన్నత చదువులు ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేశారు. ఈ క్రమంలోనే ఉస్మానియా యూనివర్సిటీలో హిందీ విభాగంలో సమకాలిన హిందీ ఉపన్యాస్‌మే మానవీయ మూల్య అన్న అంశంపై పీహెడ్‌డీని పూర్తి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

నిజాంసాగర్, ఏప్రిల్ 19: మండలంలోని గిరిజన తండాకు చెందిన పలువురు సుమారు 20 కుటుంబాలకు చెందిన వారు శుక్రవారం బీజేపీ చేరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సోదరుని సమక్షంలో పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్, శశిధర్, రాజ్ కుమార్ తదితరులున్నారు.

రైతులకు రూ.25 వేల పరిహారం అందించాలి



బీర్కూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ఎంపీటీసీ సభ్యుల డిమాండ్

బీర్కూర్, ఏప్రిల్ 19: నకిలీ విత్తనాలు, వడగండ్ల వర్షం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎకరానికి రూ.25వేల చొప్పున రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీపీ రఘు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమావేశంలో సభ్యులకు చదివి వినిపించారు. ఇదిలా ఉండగా బీర్కూర్‌లో మన గ్రోమోర్ కేంద్రం వారు కొంత మంది రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టారని, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మన గ్రోమోర్ కేంద్రం సిబ్బందిపై, విత్తన కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న రైతులకు కూడా ఎకరానికి 25 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. హమాలీల కొరత తీవ్రంగా ఉందని, దీని వల్ల ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని విండో కార్యదర్శులు సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా అధికారులు విద్యుత్ స్తంభాల కింద మొక్కలు నాటిస్తున్నారని, మొక్కలు పెరిగి పెద్దవి కావడంతో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎంపీపీ రఘు అన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ లైన్ల కింద పెరిగిన చెట్లను నరికి వేస్తున్నారని తెలిపారు. మొక్కలు నాటే సమయంలో ఇలాంటి ఘటనలు జరుగకుండా సరైన ప్రదేశాల్లో మొక్కలు నాటాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ అధికారులు విద్యుత్ బకాయిలు చెల్లించడం లేదని ఏఈ రాంప్రసాద్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఇసుక కొరత వల్ల మండలంలో అభివృద్ధి పనులు, ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, వెంటనే అధికారులు స్పందించి ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వాలని సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు, ఇన్‌చార్జి ఎంపీడీవో భానుప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ రవి, ఎంపీటీసీ సభ్యులు, జి.పీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

తాడ్వాయి, ఏప్రిల్ 19: మండలం నందివాడ గ్రామానికి చెందినబీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుర్రపు నారాయణ శుక్రవారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయినందున తాము ఆ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఏర్పాటైన టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారి అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు.అందుకోసమే తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. తనతో పాటు జిల్లా ప్రధానకార్యదర్శి గోపాల్‌రెడ్డి సైతంచేరారని తెలిపారు.

బాన్సువాడ టౌన్: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్‌బెడ్‌రూం కాలనీకి చెందిన 60 మంది యువకులు, మజిద్ మాజీ సదర్ షేక్ ఇలియాస్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఏనుగు రవీందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు యువకులు తెలిపారు.

నర్వలో కుస్తీ పోటీలు

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఏప్రిల్ 19: మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో శుక్రవారం కుస్తీ పోటీలు అలరించాయి. ఏటా శ్రీ రామ నవమిని పురస్కరించుకుని కుస్తీ పోటీలు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. స్థానిక,చుట్టూ పక్కల మల్లయోధులతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలకు చెందిన మల్లయోధులు, మహిళా మల్లయోధులు కుస్తీ పోటీల్లో తలబడ్డారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బాన్సువాడ, ఏప్రిల్ 19: బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ బస్టాండ్ వద్ద తుపాన్ వాహనం ఢీ కొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పిట్లం మండలం కుర్తి గ్రామానికి చెందిన పోతురాజు గంగవ్వ (55) అనే మహిళ తాడ్కోల్‌కు శుభ కార్యానికి రాగా రోడ్డు దాటుతున్న సమయంలో అతి వేగంగా తుపాన్ వాహనం ఢీ కొనడంతో గంగవ్వ మ్రుతి చెందినట్లు సీఐ కృష్ణ తెలిపారు. మృతురాలి సోదరుడు సాయిలు పిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అల్మాజీపూర్‌లో పోచమ్మకు బోనాల ఊరేగింపు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డి మండలంలోని అల్మాజీపూర్ గ్రామంలోని పోచమ్మ గుడిలో ఘనంగా బోనాల ఊరేగింపును జరిపారు. గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద బోనాల ప్రదర్శన నిర్వహించి సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. బోనాల ప్రదర్శన సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయమే మహిళలు నూతన వస్త్రాలు ధరించి పోచమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ప్రతీ ఇంటి నుంచి బోనం నెత్తిమీద పెట్టుకుని మహిళలు ఊరేగింపుగా గ్రామ ప్రధాన రహదారికి చేరుకున్నారు. గ్రామ పెద్దలైన సుభాష్‌రెడ్డి వనిత దంపతుల ఇంటి నుంచి సంప్రదాయబద్ధంగా బోనాల ఊరేగింపును గ్రామస్థులు ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధి గుండా పోచమ్మ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. బోనాల పండుగ నిర్వాణ కోసం ఇతర ప్రాంతాల్లో పట్టణాల్లో ఉన్న గ్రామస్థులంతా గ్రామానికి చేరుకుని బోనాల పండుగలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు, ఇతర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపులో పాల్గొన్న దృశ్యం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మనజుమిల్ బాయ్స్
శాంతి - టిల్ స్క్వేర్
ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35 - గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి - ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర - లవ్‌గురు

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

